ప్రజాశక్తి
సోమవారం 8 జులై 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పదవీకాలం ముగిసినా పూర్తవ్వని పనులు

- కాగితాల్లోనే మాజీ ఎంపి గల్లా జయదేవ్ ప్రతిపాదనలు
- నాలుగేళ్లకు రూ.20 కోట్లు కేటాయింపులు
- అసంపూర్తిగా రూ.9.37 కోట్ల పనులు
- చేపట్టనివి రూ.7 కోట్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఐదేళ్ల పదవీకాలం ముగిసినా గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ప్రతిపాదించిన అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. 2019-24 సంవత్సరాల్లో గుంటూరు ఎంపిగా పనిచేసిన గల్లా జయదేవ్ రూ.20.51 కోట్లతో 241 పనులు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు అందచేశారు. వీటిల్లో ఐదేళ్లలో కేవలం రూ.9.37 కోట్ల విలువైన 97 పనులు పూర్తయ్యాయి. రూ.1.71 కోట్లతో చేపట్టిన 42 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా రూ.7.01 కోట్లతో ప్రతిపాదించిన 102 పనులు అసలు ప్రారంభం కాలేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో నిధుల్లేక పలు శాఖల్లో అభివృద్ధి పనులు నిలిచిపోగా ప్రతిపక్ష ఎంపీలకు చెందిన నిధులతో చేపట్టిన పనులను వైసిపి స్థానిక నాయకులు అడ్డుకున్నారని టిడిపి నాయకులు చెబుతున్నారు. దీనివల్ల గల్లా జయదేవ్ ప్రతిపాదించిన పనులు ఇప్పటికీ చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

ప్రతి పార్లమెంటు సభ్యుడుకి ఏటా రూ.5 కోట్లు ఎంపి ల్యాడ్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. 1991 నుంచి ఈ నిధులు మంజూరు అవుతున్నాయి. గుంటూరు ఎంపి గల్లాజయదేవ్ తన ఎంపి ల్యాడ్స్ నిధుల నుంచి ప్రతిపాదించిన పనులు చాలా వరకు కార్యరూపం దాల్చలేదు. ప్రధానంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.80 కోట్ల అంచనాలతో 93 పనులకు ఆయన ప్రతిపాదనలివ్వగా వీటిల్లో 23 పూర్తయ్యాయి. ఏడు వివిధ దశల్లో ఉన్నాయి. 63 పనులు ప్రారంభమే కాలేదు. తన ఖాతాలో గతంలో ఉన్నపెండింగ్ నిధులతో కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.80 కోట్లకు ప్రతిపాదనలిచ్చారని అధికార వర్గాలు తెలిపాయి. 2020-21లో కరోనా కారణంగా నిధులు రాలేదు. 2021-22లో కేవలం రూ.3 కోట్లు వచ్చాయి. ఈ నిధులను సకాలంలో వినియోగించుకోలేకపోవడం, గత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.5 కోట్లతో పాటు ఆయన నిధులకు మొత్తం వచ్చిన వడ్డీతో కలిపి రూ.8.80 కోట్లతో పలు మండలాల్లో నిధులను ప్రతిపాదిస్తూ వివరాలను అధికారులకు సమర్పించారు. అయితే కొన్ని మండలాల్లో పనులు చేపట్టగా తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో వైసిపి నాయకులు ఈ పనులు చేయవద్దని కాంట్రాక్టర్లను అడ్డుకున్నారని చెబుతున్నారు.



చిలకలూరిపేట హైవే నుండి ప్రత్తిపాడు మండలం నడింపాలేనికి వెళ్లే రహదారి దుస్థితి (ఫైల్)

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పనులను తిరిగి ప్రారంభించేందుకు టిడిపికి చెందిన నాయకులకు, ఈ పనులకు కాంట్రాక్టర్లుగా ఉన్నవారు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రధానంగా తాగునీటి వసతులు, కాల్వల మరమ్మతులకు, గ్రామీణ రహదారులు నిర్మాణానికి, విద్యుత్ శాఖకు సంబంధించిన పనులకు ఎక్కువగా నిధులు కేటాయించారు. అయితే ఈ నిధులను రానున్న 18 నెలలలోపు ఖర్చుపెట్టుకునే వెసులుబాటు ఉందని, ఈ లోగా పనులు పూర్తిచేయగలిగితే నిధులు వస్తాయని అధికారులు తెలిపారు.



ఇసుక నిల్వలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

నేటి నుండి ఉచితంగా ఇసుక

ఒక్కొక్కరికి రోజుకు 20 టన్నులే : తెనాలి సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రభుత్వము నిర్ణయించిన ధరలకే ఇసుక అమ్మకాలు సాగుతాయని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అన్నారు. మండలంలోని మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో ఇసుక నిల్వలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఇసుక వినియోగదారులను ప్రభుత్వము మూడు తరగతులుగా విభజించిందన్నారు. సోమవారం ఉదయం నుంచి ఇసుక అమ్మకాలు ప్రారంభమవుతాయని, కొనుగోలుదారులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ప్రభుత్వ రుసుం చెల్లించి ఇసుకను పొందాలని చెప్పారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని స్పష్టం చేశారు. ఇసుక వినియోగదారులకు రోజుకు ఒక్కొక్కరికి 20 టన్నులు మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కొల్లిపరలో 33 వేల టన్నులు, మున్నంగిలో 1,80,000 టన్నులు ఇసుక నిల్వలు ఉన్నట్లు తెలిపారు. పరిశీలనలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ విష్ణుప్రసాద్, రవీంద్రారెడ్డి, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల నియమితులైన పి.అరుణ్‌బాబు ఆదివారం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న అరుణ్‌బాబు పల్నాడు జిల్లాకు బదిలీయ్యారు. 2014 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన అరుణ్‌బాబు ముక్కుసూటిగా వ్యవహరిస్తారనే పేరుంది. శ్రీ సత్యసాయి జిల్లాలో గత ఎన్నికల్లో వివాదాలేమీ లేకుండా సమర్ధవంతంగా పనిచేశారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్‌కు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జిల్లా ఆవిర్భావం నుండి పల్నాడు జిల్లా తొలి కలెక్టర్‌గా పనిచేసిన ఎల్.శివశంకర్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్‌కు కలెక్టరేట్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

రెండు కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణానికి చెందిన ఇద్దరు గంజాయి అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీనికి సంబంధించి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ కల్యాణరాజు వివరించారు. ఆదివారం నులకపేట సమీపంలో ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో షేక్ సుభాని, ఎస్‌కె ఖాశీం అనే ఇద్దరు కారు పక్కన నిలబడి ఉన్నారు. పోలీసులను చూసి వారు పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేసి అందులోని రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్‌తో పాటు మంగళగిరి, విజయవాడ తదితర ప్రాంతాల్లో గంజాయిని చిన్న పొట్లాలు కట్టి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. సీలేరు నుంచి వస్తున్న గంజాయిని తాము కిలో రూ.3 వేలుకు కొనుగోలు చేసి ప్యాకెట్లుగా మార్చి కిలో రూ.30 వేలకు అమ్ముతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వ్యసనాలకు బానిసైన కొంతమంది యువకులను టార్గెట్‌గా చేసుకుని ఈ అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు సిఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బంది సురేష్, నాగాంజనేయులు, కల్యాణ్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ కల్యాణరాజు.. వెనక ముసుగులో ఇద్దరు నిందితులు



మీడియాతో మాట్లాడుతున్న డిజిపి ద్వారకా తిరుమలరావు

మూతబడ్డ విభాగాలను పునరుద్ధరిస్తాం : డిజిపి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పోలీసుశాఖలో జవాబుదారితనం పెంచుతామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు అన్నారు. ఆదివారం రాత్రి గుంటూరు కృష్ణ నగర్‌లోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సదుపాయాల్లేక పోలీస్ వ్యవస్థలోని కొన్ని విభాగాలు మూతపడ్డాయని, వాటిని మళ్లీ పునరుద్ధరించి నూతన పద్ధతిలో అమలు చేస్తామని చెప్పారు. కింది స్థాయి పోలీసుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గుంటూరులోనే పుట్టి, ఇక్కడే చదువుకున్న తాను డిజిపి స్థాయిలో ఇక్కడికి రావడం సంతోషంగా ఉందన్నారు.

నల్లపాడు సిఐగా వెంకన్న చౌదరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నల్లపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. విఆర్‌లో ఉన్న ఆయనకు అధికారులు ఎట్టకేలకు నల్లపాడుకు బదిలీ చేశారు. ఈ మేరకు వెంకన్న చౌదరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పేకాట, గంజాయి బహిరంగ మద్యం సేవించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అనంతరం వైన్స్ షాపుల వద్దకు వెళ్లి మందు బాబులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా నల్లపాడు స్టేషన్‌లో ఇప్పటి వరకు సిఐగా పనిచేసిన నరేష్‌ను అధికారులు విఆర్‌కు పంపారు. ఆయనపై పలు ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఈ చర్యలు తీసుకున్నారు. ఇటీవల కొన్ని సివిల్ వివాదాలపై ఆయన తలదూర్చడంతో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకున్నారు.



మందిర వార్షికోత్సవంలో సారె పంపిణీ

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక సాయి మందిర్ రజతోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధానదాత శ్రీరామ్ రామ్మోహన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో గ్రామంలోని అన్ని దేవాలయాల్లో సారె పంపిణీ చేశారు. అనంతరం 130 మంది దంపతులచే సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. కార్యక్రమాల్లో అరవపల్లి రామ సుబ్బారావు, తడవర్తి సురేష్‌బాబు, సాయి మందిర్ కమిటీ సభ్యులు, భజన సమాజాల సభ్యులు పాల్గొన్నారు.

పిఆర్‌సిలో నష్టాన్ని పున:సమీక్షించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎపిఎస్‌ఇబి ఇంజనీర్స్ అసోసియేషన్, రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం స్థానిక డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.సామ్యూల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకత్వంతో పాటు రాష్ట్ర నలుమూలల నుండి కార్యవర్గ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. విద్యుత్ సంస్థలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1,500 ఖాళీలను దృష్టిలో ఉంచుకొని, నూతనంగా కొలువైన కూటమి ప్రభుత్వం ఈ విషయమై తక్షణమే చర్యలు తీసుకుని విద్యుత్ సంస్థల్లో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రజలకు సేవ అందించుటలో విద్యుత్ సంస్థలను ముందు వరుసలో నిలబెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్‌సిని మరొకసారి సవరించి న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఇంజనీర్లకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని గత ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరించిన తీరును రాష్ట్ర కార్యవర్గం ముక్తకంఠంతో ఖండించింది. విద్యుత్ సంస్థలో ట్రస్ట్ కు జమ చేయాల్సిన నిధులను జమ చేయకపోవడం వలన ఏర్పడిన భారాన్ని ఎంప్లాయిస్ కాస్ట్ పెరుగుదలగా చూపించి ఉద్యోగులపై రుద్దాలని చూసి ఎంప్లాయి కాస్ట్ ఎక్కువగా ఉందనే నెపంతో తీవ్ర అవకతవకలకు పాల్పడింది. విద్యుత్ సంస్థల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, పరికరాలపై వచ్చిన నష్టాన్ని సైతం అదనపు భారంగా ఉద్యోగులపై చూపించి తీవ్ర నష్టం చేసింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శామ్యూల్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.వి.రామారావు, జనరల్ సెక్రెటరీ నాగ ప్రసాద్, జెన్కో వైస్ ప్రెసిడెంట్ కె.ప్రశాంత్‌కుమార్, స్థానిక డాక్టర్ ఎన్‌టిపిఎస్ బ్రాంచ్ సెక్రటరీ కె.వి.ఆర్ చక్రపాణి కోశాధికారి యు.వెంకట్రావు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు జనరల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం గంపెడాశలతో..

ప్రజాశక్తి - పెదకూరపాడు

అనేక సమస్యలతో సతమతమవుతున్న జనం నూతన ప్రభుత్వం నియోజకవర్గంలో అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో నారా లోకేష్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను గుర్తు చేసుకుంటున్నారు.

పులిచింతల బ్యాక్ వాటర్ ద్వారా నియోజకవర్గంలోని బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాలకు పులిచింతల బ్యాక్ వాటర్ ద్వారా సాగునీరు తాగునీరు అందిస్తామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు క్రోసూరు మండలంలోని దొడ్లేరులో లోకేష్ శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. పెదకూరపాడు మండలంలోని గారపాడులో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు భూమి ఉంది. నియోజకవర్గంలో మిరప పంట ప్రసిద్ధిగాంచినది. ఆ పంట ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అమరావతి, పెదకూరపాడు మండలాల్లో నాగార్జున సాగర్ నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని చివరి వరకు ఊరించి ఉసురుమనిపించారు. ప్రస్తుత ఎమ్మెల్యేపై రైతులు గంపెడు ఆశతో ఉన్నారు. బెల్లంకొండలో సున్నపురాయి గనులున్నాయి. వాటి ఆధారంగా సున్నపు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతోపాటు స్థానికులకూ ఉపాధి దొరుకుతుంది.

రాజధానికి సమీపంలో ఉండటంవల్ల రాజధాని అవసరాలు తీర్చటానికి వ్యవసాయ రంగాన్ని మరింతగా



మాదిపాడు వద్ద కృష్ణానదిలో పడవ ప్రయాణం

అభివద్ధి చేయటానికి తగు ప్రణాళికలు రూపొందించవలసి ఉంది. ఏడాదంతా పాటు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాటిపై కూడా శ్రద్ధ పెట్టి నిర్మించవలసిన ఆవశ్యకత ఉన్నది. మాదిపాడు వద్ద కృష్ణా నదిపై బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలి. తద్వారా రవాణా సౌకర్యం పెరుగుతుంది. నియోజవర్గ స్థాయిలో కేంద్రీయ విద్యాలయ స్థాపనకు కృషి చేయవలసిన అవసరం ఉంది. క్రోసూరు కొండను అభివృద్ధి చేయటం వల్ల పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. బెల్లంకొండ కొండను కూడా అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను ఆకర్షించవచ్చు. నియోజకవర్గంలో డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయవలసి ఉన్నది. విద్యా, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, సహజ వనరులపై దృష్టి పెడితే నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

ఇక్కడ గెలిచినా గుంటూరులోనే..

పెదకూరపాడు నియోజకవర్గ నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ఎక్కువమంది గుంటూరులోనే నివాసముంటున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నియోజకవర్గంలో కార్యాలయాలు ఏర్పాటు చేయటం, నివాసమంటూ జరుగుతుంది. గెలిచిన అనంతరం గుంటూరులోనే కార్యాలయం, నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో టిడిపి ఎమ్మెల్యేగా పని చేసిన డాక్టర్ కాసరనేని సదాశివరావు గుంటూరులోనే ఉండేవారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ తరుపున నాలుగు సార్లు గెలిచిన కన్నా లక్ష్మీనారాయణ కూడా గుంటూరు నుంచి కార్యకలాపాలు నిర్వహించారు. పెదకూరపాడుకు చెందిన కొమ్మాలపాటి శ్రీధర్ కూడా గుంటూరలోనే ఉన్నా అప్పుడప్పుడు పెదకూరపాడులో ఉండేవారు. వైసిపి ఎమ్మెల్యేగా పని చేసిన నంబూరు శంకర్రావు కూడా గుంటూరు నుంచే కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం టిడిపి చెందిన భాష్యం ప్రవీణ గుంటూరు నుంచి ఎమ్మెల్యేగా కార్యకలాపాలు నిర్వహిస్తారా? నియోజకవర్గంలో ఉంటూ బాధ్యతలు నిర్వహిస్తారా? అనే ఆసక్తి నెలకొంది. బెల్లంకొండ, అచ్చంపేట మండలం వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణం చేయవలసి ఉంటుంది. దాంతోపాటు నలుగురు కలిసి వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు కూడా భారంగా ఉంటుంది. కావున ప్రస్తుతం ఎమ్మెల్యే ఏ నిర్ణయం తీసుకుంటారనేది వేచి చూడవలసింది.

విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

విశ్వకర్మ పేదవిద్యార్థి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, విద్యాఉపకరణాలు పంపిణీ



ప్రజాశక్తి-గుంటూరు

మానవ నాగరిక సమాజానికి కావాల్సిన అన్ని రకాల పనిముట్లను అందించిన విశ్వబ్రాహ్మణులు ఆధునిక సమాజంలో మనుగడ సాధించాలంటే పండిత గానాల రామమూర్తి స్ఫూర్తితో విద్యావంతులు కావాలని విశ్రాంత అధ్యాపకులు ప్రొఫెసర్ కందేపి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేట విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో విశ్వకర్మ పేదవిద్యార్థి సంక్షేమ సంఘం 27వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని దయా హృదయ సేవా సమితి అధ్యక్షులు అమతలూరి వీరబ్రహ్మేంద్రరావు, స్వర్ణశిల్పి శంభాన వీరభద్రాచారి, లఘు చిత్రాల నిర్మాత, దర్శకులు గన్నే వాసుదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సిహెచ్.వెంకటవసంతరావును సన్మానించిన అనంతరం పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటుపుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు గోనుగుంట్ల శేషగిరిరావు మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా దాతల సహకారంతో నగరంలోని పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ సంఘం అధ్యక్షులు పట్నాల శివప్రసాద్ సభకు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో దుగ్గిరాల సబ్ రిజిస్ట్రార్ అద్దంకి నవకుమార్, సంఘ కార్యదర్శి కటేవరపు కృష్ణారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్‌బాబు, ఇంజినీర్ కందేపి వెంకటరావు, కందుకూరి లక్ష్మీనారాయణ, అంగలకుదుటి సుశీల, ఇంజినీర్ కందేపి వెంకటరావు, మేడూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రజాశక్తి - పొన్నూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు నూతన అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ రవి రాకేష్ దేవ్, నన్నపనేని బాలకృష్ణ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితోపాటు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో స్థానిక నిర్మాణంలో ఉన్న రోటరీ నూతన భవన స్థలములో ఆదివారం అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్ళు ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ ప్రెసిడెంట్ వై.వీరయ్య అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో తొలుత రోటరీ వ్యవస్థాపకులు పాల్ హరిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న 2025-26 ఎలెక్ట్ డిస్టిక్ గవర్నర్ సోమవరపు రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ నిస్వార్థంగా సేవలు అందిస్తోందన్నారు. పార్టీలు, కులాలు, మతాతలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పోలియో మహమ్మారిని పారదోలేందుకు రోటరీ క్లబ్ చేసిన కృషి అమోఘమన్నారు. రోటరీ చేస్తున్న సేవలను చూసి ఆకర్షితులైన అనేక రంగాలకు చెందిన ప్రముఖులు రోటరీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. పొన్నూరు రోటరీ క్లబ్ 49 వసంతాలు పూర్తి చేసుకొని 50 వసంతంలోకి అడుగుపెట్టేందుకు అత్యుత్సాహంతో ముందుకు సాగుతున్న సీనియర్ క్లబ్ అని అన్నారు. క్లబ్‌లో మహిళలు చేరడం వల్ల ఆ క్లబ్‌లు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి రూ.కోటి విలువ చేసే స్థలాన్ని ఉచితంగా అందించిన కొసరాజు సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని మాట్లాడుతూ పొన్నూరు రోటరీ క్లబ్ సేవ అందించడంలో ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు కార్యదర్శి వై.వీరయ్య, బోడపాటి రామారావు, పాములపాటి రవీంద్రనాథ్, బివి చౌదరి, జిఎంఎస్ గుప్తా, బి.శ్రీనివాస్‌రావు, ఎన్.మేఘనాథ్, కె.రమేష్, కె.శ్రీనివాస్, తోట భాను ప్రసాద్, జి.శివరామకృష్ణ, కె.రామకృష్ణ, బి.రాజేంద్ర చౌదరి, వై.వీరయ్య, కె.ఆంజనేయులు, అంబటి వెంకటేశ్వరరావు, పి.విజయసారథి పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన

వినుకొండ విద్యార్థులకు అభినందన సభ



ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని ఎపి ఎన్జీవో హోం లో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 2024 ఐఐటీలో జేఈఈ అడ్వాన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు 500 లోపు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన వినుకొండ నియోజకవర్గ విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. 323 ర్యాంకు సాధించిన ఎం. సాయి తేజ, 380 ర్యాంకు సాధించిన వివి శ్రీకాంత్, 460 ర్యాంకు సాధించిన ఎస్ ఫణి, 144(ఈడబ్ల్యూఎస్) ర్యాంకు సాధించిన రిషికేష్, 292(ఈడబ్ల్యూఎస్,) 292 ర్యాంకు సాధించిన ప్రమోద్‌లను, వారి తల్లిదండ్రులను పూల మాలలతో జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు భార్య గోనుగుంట్ల లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు అంకిత భావంతో పట్టుదలగా కృషి చేస్తేనే జీవితములో ఉన్నత స్థాయిని చేరుకుంటారన అన్నారు. తెలిపారు. డిగ్రీల కన్నా వృత్తి నైపుణ్యాలు ముఖ్యమని, విద్యార్థులు ఇష్టమైన నైపుణ్యాన్ని ఎంపిక చేసుకొని దానిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. విశిష్ట అతిథి మాదాల రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాష పై పట్టు పెంచుకొని ఉన్నతంగా ఎదగాలని, లక్ష్యం సాధించే వరకు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు గౌరవ అతిథి శర్మ, ఇంగ్లీష్ మీడియం డైరెక్టర్ వివి శర్మ మాట్లాడుతూ లెక్కలు ,భౌతిక శాస్త్రములలో పునాది ఏర్పడేటట్లు లోతైన భావాలను అధ్యయనం చేసినట్లయితే ఐఐటి సీటు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జి .నాగేంద్రుడు, పుట్టంరాజు నారాయణరావు, ఏపీటీఎఫ్ నాయకులు ఎస్కే షరీఫ్, టి.శ్రీనివాస్, మహమ్మద్ యుటిఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, గంగవరపు వెంకాయమ్మ, మాదినేని ఆంజనేయులు, కౌన్సిలర్లు పివి. సురేష్ బాబు, ఎం.ఎస్‌కె బాషా, కవి కరిముల్లా, కళాసాగరి ట్రస్ట్ కూచి రామాంజనేయులు, వి చంద్రమౌళి, బిజెపి నాయకులు ఎండ్లూరి వీరయ్య, ప్రముఖ చిత్రకారులు ప్రసాద్ రోటరీ క్లబ్ అసిస్ట్ గవర్నర్ ఏ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రేణుక బాబు, సావిత్రి అన్న కోటేశ్వరరావు, ఏ. శ్రీనివాసరావు, పత్తి పూర్ణ సౌదాగర్ జానీ పాల్గొన్నారు.

వారాంతపు సెలువులు ఆర్భాటమే.. అమలు లేదు..

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పోలీసుల కష్టాలు కూటమి ప్రభుత్వములో నైనా తీరేనా అని ఆ శాఖలో పె ద్ద ఎత్తున చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పోలీస్ శాఖను తీవ్ర నిర్లక్ష్యం చేయడంతో పాటు వారికి ఇవ్వాల్సిన సొమ్మును సైతం అందించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. వీక్లీఆఫ్ అమలును ఆర్భాటముగా ప్రారంభించి సంవత్సరం గడవక ముందే తిలోదకాలు ఇచ్చేసిందనే విమర్శలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వమైనా పోలీస్ సిబ్బందికి ఇచ్చిన హామీ లను నెరవేరుస్తుందా అనే ఆశతో ఉన్నారు. నియోజకవర్గ స్థాయిలో అర్బన్, రూరల్ పరిధిలో చూస్తే.. అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఒక సి.ఐ, నలుగురు ఎస్.ఐలు, 30 35 మంది సిబ్బంది,రూరల్ పరిధిలో పట్టణం లో ఒక సిఐ, ఇద్దరు ఎస్.ఐలు, యడ్ల పాడు పరిధిలో1ఎస్.ఐ, 10,14 మంది సిబ్బంది ఉన్నారు. నాదెండ్ల మండల పరిధి లో1ఎస్.ఐ10, 14 మంది సిబ్బంది హెూమ్ గార్డులు కలపుకుని వున్నారు. ప్రస్తుతా నికి పోలీస్ సిబ్బంది రెట్టిం పుగా ఉండాలి. గడచిన ఎన్నికల ప్రచారంలో భాగం గా తాము అధికారలోకి వస్తే పోలీసులకు వీక్లీ ఆఫ్ అమ లు చేస్తామని టిడిపి కూటమి హామీ ఇచ్చింది. పని భారం పెరిగి అనారోగ్య సమస్యలు,టి.ఎ,ఎస్ఎ ఎల్ఎస్ సొమ్మును సైతం సకాలంలో ఇవ్వని పరిస్థితి.

ఈ హామీ కి ఆర్థికంగా నిదులు వెచ్చించాల్సిన అవసరం లేదు కనుక, వీక్లీ ఆఫ్ అమలు కోసం పోలీస్ సిబ్బంది ఎదురు చూస్తున్నారు. కొన్ని సార్లు చేతి సొమ్ము పెట్టుకుని విధులు నిర్వర్తించాల్సి రా వడం అత్యంత దారుణ మని చెప్తున్నారు. వీక్లీ ఆఫ్ లేక పోవడం, బందోబస్తు తో విశ్రాంతి లేక ప్ర తి స్టేషన్లో ఎదో రకంగా కానిస్టేబుళ్ల,సి బ్బంది అనారోగ్య సమస్యలు తీవ్రతరమౌతున్నాయంటున్నారు.కొత్త ప్రభుత్వమైనా తమమొర ఆలకించి టర్మ్ విధులను రద్దు చేయడంతో పాటు వీక్లీ లఫ్ అమలు పోలీ స్ సిబ్బంది కోరుతున్నారు. కొత్తగా కానిస్టేబుళ్ల నియామకం పెద్ద ఎత్తున జ ర గాల్సి ఉంది. గత ప్రభుత్వం కాని స్టేబుల్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన నోటి ఫికేష కోర్టులో ఉందని, ఎప్పటికి తేలుతుందో తెలియని పరిస్థితి. దీంతో ఎంతో మందికి వయస్సు దాటిపోయి, పోలీస్ అద్యో గానికి అర్హత కోల్పోయిన పరిస్థితులున్నా యి. పోలీస్ శాఖ లో ఉద్యోగాల భర్తీ జరిగితే తప్ప సిబ్బంది కష్టాలుతీరే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం కొత్త నోటిపికేషన్ కోసం యువత ఎదురు చూస్తోంది. పోలీస్ సిబ్బందికి ఇవ్వా ల్సిన సొమ్ము సైతం గత ప్రభుత్వం ఇ వ్వలేదు. టిఎ రూపంలో నెల కు రూ. 2100 ఇవ్వాల్సి ఉందని, అది కూడా నెలలుగా ఇవ్వని పరిస్థితి. సరెండర్ లీవ్ సంబంధిం చిన సొమ్ము బకాయిలు ఉన్నాయి. దీంతో స్కూల్ ఫీజులు, కుటుంబ అవసరాలు, ఇతర అత్య వసర పరి స్థితుల్లో డబ్బు లేక అధిక వడ్డీల కు తీసుకోవాల్సి వస్తుందంటున్నారు. కూటమి ప్రభుత్వమైనా తమ మొర ఆలకించా లంటున్నారు.

ఆశల పల్లకిలో అన్నదాత

రూ.20 వేల పెట్టుబడి సాయం కోసం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఒకవైపు ప్రకతి వైపరీత్యాలు, మరోవైపు చీడపీడ దాడి, ఇంకోవైపు చేతికింది పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం, మార్కెటింగ్ సదుపాయం లేక ఏటా నష్టాలు పాలవుతున్న అన్నదాత కొత్త ప్రభుత్వంలో అయినా రాష్ట్ర ఆర్థిక సాయం పెరుగుతుందని ,సకాలంలో బ్యాంకు రుణాలు అందుతాయని అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు 20 వేల ఆర్థిక సహాయం అందిస్తామంటూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్రం తో పాటు పెదకూరపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఇరవై ఒక్కవేల మెజారిటీతో గెలుపొందారు. ప్రమాణ స్వీకారం కూడా పూర్తయింది. మరోవైపు రుతుపవనాలు ఆగమనం పెదకూరపాడు నియోజవర్గంలో అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజనులకు సంబంధించి ఇప్పటికే రైతులు విత్తనాలు వేసేందుకు దుక్కులు దున్నేరు. ట్రాక్టరు తోలకాలు తోలారు. ప్రత్తి విత్తనాలు వేయటానికి సిద్ధంగా ఉన్నారు. మిరప నారు దిబ్బలు పోయటానికి సిద్ధమవుతున్నారు. సోయాబీన్, ఇతర అపరాల పంటలు కూడా వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. విత్తనాలు సమకూర్చుకోవాల్సిన సమయం ఇది. వీటన్నిటికీ డబ్బే ప్రదానం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తామన్న సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు ఖరీఫ్ బ్యాంకు రుణాలపై అధికార యంత్రాంగంలో ఎప్పటికీ కదిలిక లేదు వరి, ప్రత్తి తోపాటు మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటి తుడుపుగానే ఉంది. ఈ నేపథ్యంలో అందరికీ అన్నం పెట్టే రైతన్న ఆశ నిరాశతో ఎదురుచూస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదు మండలాలు అమరావతి, అచ్చంపేట, బెల్లంకొండ, క్రోసూరు, పెదకూరపాడు. నియోజకవర్గ వ్యాప్తంగా 1,34,497 ఎకరాలు భూమి సాగులో ఉన్నది. అందులో వివిధ పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా ప్రత్తి, మిరప, వరి, ఇతర అపరాల పంటలు ఉన్నాయి. పెదకూరపాడు ప్రాంతం మిరప పంటకు ఆసియా ఖండంలోనే ప్రసిద్ధి. కొత్త వంగడాలను వినియోగించాలన్న, దిగుబడి సాధించాలన్న ఈ ప్రాంతానికి పేరు ఉంది. ఎకరానికి 40 క్వింటాళ్లు దిగుబడి తీసిన చరిత్ర. ఇటువంటి పరిస్థితులలో తక్షణమే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, లేదంటే సాగు కష్టమేనని రైతులలో చర్చ నడుస్తుంది. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరిట ఏటా మూడు దఫాలుగా 13,500 రైతులకు అందించారు. దీనిలో కేంద్రం వాటా కూడా ఉన్నది. అనేక నిబంధనలు పెట్టారు. అర్హులైన వేలాదిమందికి సాయానికి నోచుకోలేదు.

పెదకూరపాడులో 3000 మంది దరఖాస్తులు చేసుకోగా 2126 మందికి అందించారు. మిగిలినవి ఒకే కుటుంబ సభ్యులు కావడం, ఆదాయపన్ను రిటర్న్ చేయటం, హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ లేకపోవడం తదితర అంశాలతో రిజెక్ట్ అయ్యాయి.వీరిలో ఎక్కువ మంది కౌలు రైతులు, భూ యజమానుల నుంచి నిరంభ్యంతర పత్రాలు తెచ్చుకోకపోవడంతో సాయానికి దూరం కావలసి వచ్చింది. కొంతమందికి సాంకేతిక సమస్యలతో ఐదు ఏళ్ళు ఎదురుచూపులు చూశారు. ఈసారైనా నిబంధనలు సడలించి తమ ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన ఇంజినీర్లకు సన్మానం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డిప్లమో ఇంజనీర్లను నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం సత్కరించారు. కార్యక్రమానికి గుంటూరు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.మురళీకృష్ణయాదవ్, సిఆర్‌డిఎస్ సర్కిల్ సూపరింటెంటెండ్ ఇంజనీర్ పి.విజయకుమార్, ఎపి పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదిర్శ కెవి.శేషారెడ్డి, కంపెనీ సలహాదారు కె.రవిశేఖర్ , వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హుస్సేన్ ఖాన్, ఎ.గుర్నాధరావు తదితరులు పాల్గొని రిటైర్డ్ అయిన ఇంజనీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంజనీర్లు జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిబద్ధతతో పనిచేశారని అన్నారు.



సత్కారం పొందుతున్న ఉద్యోగ విరమణ చేసిన డిప్లమో ఇంజనీర్లు

మద్యం మత్తులో రెండు గ్రూపులు ఘర్షణ

ఇద్దరికి గాయాలు



బిక్కి పాపారావు

ప్రజాశక్తి-ఈపూరు

మద్యం మత్తులో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోగ ఇద్దరికీ గాయాలైన సంఘటన మండలంలోని కొచ్చర్ల గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూమాటి కోటేశ్వరరావు, నలబోతుల గురవయ్యలు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు గొడవ పడ్డారు. కొంచెం సేపటికి గురవయ్య కుమారుడు నలబోతుల వెంకటేశ్, బిక్కీ పాపారావు ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేయడంతో ఇరువర్గాలు పరస్పరం కర్రలతో దాడి చేసుకోవడంతో పాపారావు తలకు గాయమైంది. అడ్డుగా వచ్చిన ఆయన భార్య భాగ్యలక్ష్మి కు స్వల్ప గాయాలయ్యాయి. పాపారావుకు వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఎస్సై షేక్ మహమ్మద్ ఫిరోజ్ గొడవ జరిగే ప్రాంతానికి చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. తూమాటి కోటేశ్వరరావు,నలబోతుల గురవయ్యలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఫిరోజ్ తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శిరీష అజయ్ చింతగుంట

ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఆర్ఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో రొంపిచర్ల మండలం కొత్తపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కొత్తపల్లి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు 225 మందికి పైగా పాల్గొని వైద్య సేవలు పొందారు. ఈ వైద్య శిబిరంలో పల్నాడు ప్రాంత మొట్ట మొదటి మహిళా గుండె మరియు ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలు డాక్టర్ శిరీష అజయ్ చింతకుంట పాల్గొని వైద్య సేవలు అందించారు. బిపి, షుగర్, హెచ్.బి.ఎ, ఏ1సి, కొలెస్ట్రాల్,ఈసీజి, 2డి ఎకో వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష అజయ్ మాట్లా డుతూ వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు 15 రోజుల పాటు తమ హాస్పిటల్ లో ఓపి ఉచితమని అవసరమైన మిగతా అన్ని పరీక్షలకు 30 శాతం రాయితీపై చేయడం జరుగుతుందన్నారు. నరసరావుపేట పట్టణం వినుకొండ రోడ్డులోని తమ హాస్పిటల్ లో అధునాతన దంత వైద్య సేవలతో గుండె,ఊపిరితిత్తులు, గుండెనొప్పి, గుండె పెరుగుట, గుండె చుట్టూనీరు చేరడం , గుండెదడ, కాళ్ళ వాపులు, కళ్ళు తిరుగుట, మరియు సాధారణ వ్యాధు లు జ్వరం, బి.పి, షుగర్, జలుబు, దగ్గు, ఆయాసం, అలర్జీ, ఉబ్బసం (ఆస్తమా) థైరాయిడ్ అన్ని రకాల జ్వరాలు, పాముకాటు, పురుగు మందులు ఎమర్జన్సీ కేసులు అన్ని వేళలా అందుబాటులో ఉంటామని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో వైద్య చికిత్సలు అందిస్తున్నా మన్నారు. రానున్న రోజులలో తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తమ సేవలను పల్నాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయం

ప్రజాశక్తి-పెదకూరపాడు

ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం అభినందనీయమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు రీజినల్ హెడ్ జవహర్, నరసరావుపేట రీజినల్ డిప్యూటీ హెడ్ సోమేశ్ కుమార్, పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్.సి.యం ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ రీజనల్ మేనేజర్ కేలూర్డు రాజు ఏర్పాటు చేశారు. కంటి శిబిరాన్ని టిడిపి అధ్యక్షులు రమేష్ ప్రారంభించగా, పంటి శిబిరాన్ని రీజనల్ హెడ్ జవహర్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి



సంవత్సరం ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయటం ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామాల నుంచి విదేశాలు వెళ్లినవారు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, ఇతర ఉద్యోగులు తమ జన్మభూమి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లూర్డు రాజు శాశ్వత ప్రాతిపదికన అలోపతి, దంత వైద్యశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ స్ఫూర్తి కి గ్రామస్తులు కూడా సహకరించాలని కోరారు. శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించారు. వందలాది మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు తేదీలను తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కె రత్తయ్య, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెదకూరపాడు బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది జగదీష్, శంకర ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, స్థానిక నాయకులు బి.రాంగోపాల్రావు, బి.ఆంజనేయులు, జి.బాబురావు, జి. కోటేశ్వరరావు, పాల్గొన్నారు.

అంజిరెడ్డి హాస్పిటల్స్ ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-నూజెండ్ల



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నరస రావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రక్త పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఎకో టెస్టులను ఉచితంగా చేసి 250 పైగా రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ సూపర్ స్పెషాలిస్ట్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజి, కార్డియాలజీ విభాగానికి సంబంధించి డాక్టర్ కోటా శబరి గిరీష్, క్రిటికల్ కేర్ జనరల్ మెడిసిన్ విభాగానికి సంబంధించి డాక్టర్ చింత కృష్ణ చైతన్య, ఇఎన్‌టి విభాగానికి సంబంధించి డాక్టర్ ఏపూరి రాజేష్, డాక్టర్ రజిత, జనరల్ సర్జరీ విభాగానికి సంబంధించి డాక్టర్ శివతేజలు తమ సేవలు అందించారు. డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ వారు మెడికల్ ఎక్విప్‌మెంట్ ఇసిజి, 2డి ఎకో, ఎండొస్కోపీ మొదలగు వైద్య పరికరాలను ఈ వైద్య శిబిరానికి తీసుకుని వచ్చి రోగులకు వ్యాధి నిర్ధారణ చేశారు. అంజిరెడ్డి హాస్పి టల్ పరిపాలన అధికారి పరిటాల సత్యనారాయణ హాజరయ్యారు. వైద్య శిబిరం విజయవంతం అయిందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

పడకేసిన పారిశుద్ధ్యం

- పిడుగురాళ్లలో సరిగా లేని డ్రెయినేజీ వ్యవస్థ
- దోమల తీవ్రత
- తాగునీటి పైపులైన్లలోకి మురుగునీరు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

పట్టణంలో రోజురోజుకీ అతిసార వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పారిశుధ్యం మెరుగుకు చేపట్టాల్సిన చర్యలు కూడా శూన్యమే. వర్షకాలం ప్రారం భం అవుతండగానే ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. అధికారులు సైతం అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలి. కానీ పట్టణంలో మాత్రం అవేమి కనిపించటంలేదు. దీంతో, పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. పట్టణ శివారు ప్రాంతాలే కాకుండా పట్టణంలోని 33 వార్డుల్లో ఎక్కడ కూడా అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్ల దోమలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, చిన్న చిన్న గుంటలలో నీళ్ళు నిల్వ ఉండ టంతో దోమల తీవ్రత పెరుగు తోం దని పట్టణ ప్రజలు చెబుతున్నారు. చిన్నారులు, వృద్ధులపై అతి సార ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మున్సిపల్ కార్మికులు సైతం అతిసార బారిన పడుతున్నారు. మున్సిపల్ కార్మికుడు పర్స బాలకృష్ణకు అతిసార సోకి మృతి చెందాడు.

పగిలిన పైపులైన్లు

పట్టణంలో గతంలో తాగునీటిని సమీప క్వారీల నుండి సేకరించి శుద్ధి చేసి పట్టణ ప్రజలకు అందజేయడం లేదా బోర్ల ద్వారా భూగర్భ జలాలను అందించే వారు. గత ప్రభుత్వంలో కృష్ణా



పిడుగురాళ్లలోని నవీన కాలేజీ వద్ద..



నీటిని పట్టణ ప్రజలకు అంద జేసేందుకు నూతనంగా పైపులైన్లు ఏర్పాటు చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో అధికారులు, కాంట్రాక్టర్లు



పిడుగురాళ్లలోని మోండీ గేట్ సమీపంలో మురుగునీటిలో తాగునీటి పైప్‌లైన్

పైపులైన్ల ఏర్పాటులో అలసత్వం వహించారు. వారి ఇష్టానుసారం డ్రైనేజిలలో కలిపి వేయడంతో ఇప్పుడు ఆ పైపు లైన్లు పగిలిపోయి వాటి ద్వారా తాగునీటి సరఫరా చేసే పైప్ లైన్లలోకి మురుగునీరు చేరుతోందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవ డంతో అతిసార పెరగడానికి ప్రధాన కారణమవుతోందని అంటున్నారు.

కనీస ప్రమాణాలు పాటించిన వాటర్ ప్లాంట్లు

పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లు కనీస ప్రమాణాలు పాటించకుండా తాగునీటి సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మన్సి పాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ప్రతి శుక్రవారం డ్రైనే జీలలో స్ప్రేయర్ల ద్వారా లిక్విడ్‌లు చల్లించాలి, కానీ పట్ట ణంలోని ఏ వార్డులలో కూడ అలాంటి పరిస్థితి లేదు. కనీస మౌలిక సదు పాయాలు కూడ కార్మికులకు అందు బాటులో లేవని, 33 వార్డులకు కేవలం రెండు స్ప్రేయర్లు మాత్రం ఉన్నాయని కార్మికులు చెబుతున్నారు. అతిసార నివారణకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు వేగవంతం చేసేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

10న 'డిమాండ్స్ డే'ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కార్మికుల హక్కుల సాధన కోసం, కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్స్‌ను అమలు చేయొద్దని కోరుతూ ఈ నెల 10న దేశ వ్యా ప్తంగా జరిగే 'డిమాండ్స్ డే' ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరీపురంలని సిఐటియు కార్యాలయంలో ఆదివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం దేశ సంపదను కార్పొరేటర్లకు కట్టబెట్టే ప్రైవేటీకరణ విధానాలు కొనసాగిస్తామంటోందని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయనికుండా ఆపాలని, ప్రావిడెంట్ ఫండ్ పీఎఫ్ సకాలంలో చెల్లించని యజమానులకు వేసే జరిమానాపై రాయితీలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. ఇటువంటి చట్టాల వల్ల రాబోయే కాలాల్లో యజమాను లెవరు పిఎఫ్ బకాయిలు, సకాలంలో చెల్లించకుండా జాప్యం చేస్తారన్నారన్నారు. లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ పథకం (నేషనల్ మోనిటైజేషన్ ఆఫ్ పైప్ లైన్) లను ఆపాలన్నారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, నేకో, ఆయుష్, సేంద్రీయ వ్యవసాయం, 108, 104 తదితర అన్ని పథకాల కార్మికులను కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనం చెల్లించాలని, వారికి పింఛన్ లాంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం నెలకు రూ.26,000 చొప్పున నిర్ణయించి అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్ తదితర కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్టర్లను తొలగించినా కార్మికులను తొలగించకూడదని, అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా తీసుకువచ్చిన 101,102 ఎంవిఆర్‌టి బిల్లును ,రాష్ట్రంలో అమలవుతున్న 21వ జీవోని వెంటనే రద్దు చేయాలని, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు వెంటనే అమలు చేయాలన్నారు. అంతేకాకుండా రెగ్యులర్ చేయాలన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీమును అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్



సమావేశంలో మాట్లాడుతున్న పేరుబోయిన వెంకటేశ్వర్లు

ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పలు డిమాండ్ల సాధన కోసం మండల, నియోజకవర్గంలోని అన్ని కార్మిక సంఘాల వారు 'డిమాండ్స్ డే'ను జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి అధ్య క్షులుగా సాతులూరి బాబు వ్యవహరించారు. సిఐటియు సహాయ కార్యదర్శి ఎం. విల్సన్, సిఐటియు, సంఘాల నాయకులు అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులు, భవన నిర్మాణ, విద్యుత్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టాలపై 31 వరకు అవగాహన

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

మాచర్ల మండల న్యాయ సేవ కమిటి ఆధ్వర్యంలో మోటార్ వాహనాల చట్టాలు, నిబంధనలు పై అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల న్యాయ సేవా కమిటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదే శానుసారం మాచర్ల మండల న్యాయ సేవా కమిటి, మాచర్ల ప్రాంతీయ రవాణా కార్యలయం, మాచర్ల పోలీస్ శాఖ సం యుక్తంగా ఈ నెల 31వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మోటార్ వాహనాల చట్టం, నిబంధనలు పై వాహనదారులకు అవగాహన కల్పించటం, వాహన ప్రమాధాల నుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించడం, మోటార్ వాహనాల చట్టం, నిబంధనలు ఉల్లంఘించిన వారికి పడే శిక్షలు గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాల్లో వాహనదారులు, డ్రైవర్లు, స్థానికులు తప్పక పొల్గొనాలని కోరారు.

వినుకొండలో సిఎంఇ సదస్సు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైద్యులు ఎప్పటికప్పుడు వైద్య రంగంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రోగులకు మెరుగైన చికిత్స అందించాలని శ్రీ దత్త హాస్పిటల్ అధినేత ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, శకుంతల జనరల్, జీర్ణకోశ క్రిటికల్ కేర్ హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ ఐలా శ్రీనివాస్ అన్నారు. వినుకొండ పట్టణంలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాలులో వినుకొండ ఐఎంఎ వైద్యులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో గుండె మరియు జీర్ణకోశ, కామెర్లు వ్యాధులకు అందించాల్సిన ప్రాథమిక చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్,ప్రముఖ గుండె వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ గార్లపాటి కృష్ణ కాంత్ మాట్లాడుతూ 'గుండెపోటు - గుండె పనితీరు , గుండె వైఫల్యం చెందడం ముందుగానే ఏ విధంగా గుర్తించాలి.. దానికి తగిన ప్రాథమిక చికిత్స ఎలా అందించాలి 'అనే అంశం మీద వైద్యులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డాక్టర్ల సందేహాలను నివృతి చేశారు. శకుంతల గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్ ప్రముఖ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ ఐలా శ్రీనివాస్, కామెర్ల వ్యాధి



డాక్టర్ ఐలా శ్రీనివాస్, డాక్టర్ కష్ణకాంత్ లను సత్కరిస్తున్న వైద్యులు

లక్షణాలు, దాని నివారణ మార్గాలు, చిన్న పిల్లలలో, పెద్దవారిలో కామెర్ల వ్యాది గురించి అవగాహన కల్పించారు. సాంప్రదాయ బద్ధంగా, తాజాగా తయారు చేసుకున్న ఆహారం సురక్షితమైన నీరు తీసుకోవడం వలన కామెర్లు, జీర్ణకోశ వ్యాధుల నుండి ఉపశమనం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐఎంఎ వినుకొండ అధ్యక్షులు డాక్టర్ కెవివి ఎల్ ఎన్ రావు మాట్లాడుతూ ఇటువంటి అవగాహన సదస్సుల వలన వైద్యులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకొని రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సదస్సు నిర్వహించిన వైద్యులు గార్లపాటి కృష్ణ కాంత్, ఐలా శ్రీనివాస్ లను వినుకొండ ఐఎంఎ తరపున సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ దత్త హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానేశ్వరి, ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ జి సౌశీల్య, ట్రెజరర్ డాక్టర్ ఈదర కిషోర్ రెడ్డి, ఐఎంఎ వినుకొండ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల సీనియర్ సిటిజన్లు శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-గుంటూరు

సీనియర్ సిటిజన్స్ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సృజన్ కుమార్ అన్నారు. అరండల్‌పేట అవగాహన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ సృజన్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌లో సాధారణంగా వచ్చే అనారోగ్య సంబంధిత సమస్యలపై వివరించారు. సీనియర్ సిటిజన్స్ ఆరోగ్య సమస్యలుంటే రెగ్యులర్‌గా, వైద్యుని సంప్రదిస్తూ వారి సలహా సూచనలు మేరకు తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద వయసువారు ఆహారంలో జాగ్రత్తలు తీసుకోవాలని, వారు తీసుకునే ఆహారంలో ప్రోటీన్ శాతాన్ని ఎక్కువగా ఉండేటట్లు చూసుకోవాలని, ప్రోటీన్లు అధికంగా లభించే గుడ్డు, చికెన్, చేప, సోయా, మొలకెత్తే విత్తనాలు లాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని చెప్పారు. పెద్ద వయసు వారు బరువులెత్తి వ్యాయామం చేయకపోయినా వాకింగ్, సైక్లింగ్ లాంటి వ్యాయామాలు చేస్తూ ఉంటే ఆరోగ్యానికి మంచిదని తెలిపారు.పెద్ద వయసు వారికి వ్యాయామం, వైద్యం ఎంత ముఖ్యమో వారు వారికి సంతోషం కలిగించే విధంగా జీవించటం కూడా అంతే ముఖ్యమన్నారు. చిన్నపిల్లల్లో మాదిరిగానే పెద్దల్లో కూడా వివిధ వ్యాక్సిన్లు ఉంటాయని, వాటిని గురించి వివరిస్తూ ముందుగా ఫ్లూ వ్యాక్సిన్ గురించి తెలియజేస్తూ ఇది వైరల్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అని కొంతమంది పెద్దలలో ఈఫ్లూ వైరస్ మూలాన ఆయాసం డెంగీ లాంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. ముఖ్యంగా మధుమేహం, గుండె, ఆస్తమా, కేన్సర్ లాంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఈ వ్యాక్సిన్‌ను తప్పక తీసుకోవాలని, ఈ వ్యాక్సిన్ ప్రతి సంవత్సరం తీసుకోవాల్సి వస్తుందని, ఒకసారి ఈ వ్యాక్సిన్ తీసుకుంటే ఆరు నెలలు పని చేస్తుందన్నారు. 65 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఈ వ్యాక్సిన్ తీసుకోవడం మంచిదన్నారు. ఈ వ్యాక్సిన్ సాధారణంగా జులై గానీ ఆగస్టులో తీసుకుంటే వర్షాకాలం సమయానికి ఈ వ్యాక్సిన్ పనిచేయడం ప్రారంభమై పెద్దల్లో వివిధ రకాల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఆరోగ్యంగా జీవించటానికి సహాయ పడుతుందన్నారు. ఆరోగ్య సభకు ఇవి సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, సంస్థ సీనియర్ సభ్యులు బసవగుప్తా, విద్యాధర కుమార్, న్యాయవాది సుభాని, సంస్థ సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సృజన్



వైద్య సేవలు అందిస్తున్న ప్రైమ్ హాస్పిటల్స్ వైద్య బృందం

నందివెలుగులో ప్రైమ్ హాస్పిటల్స్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి : మండలంలోని నందివెలుగులో బొడ్డు వెంకట సుబ్బయ్య కల్యాణ మండపంలో ఎంపిటిసి తిన్నలూరి విజయలక్ష్మి, గుంటూరు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అచ్చంశెట్టి అన్వేష్ కుమార్, డాక్టర్ జల్లెపల్లి తేజస్వి, డాక్టర్ కాసుల సాయి రాజశేఖర్, డాక్టర్ పవన్ బడుగు, డాక్టర్ జి.మాధవి లత, డాక్టర్ మంగిశెట్టి విజయకృష్ణ, డాక్టర్ రినా, డాక్టర్ సాగర్, డాక్టర్ బూసిరెడ్డి విశ్వ, డాక్టర్ దేదీప్య శిబిరంలో వైద్య సేవలు అందించారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య బృందం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఎంపిటిసి విజయలక్ష్మి అన్నారు.

బాబాలు, స్వాములపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గుంటూరు : మూఢత్వాన్ని, మత విశ్వాసాలను సొమ్ము చేసుకునే డేరా బాబాలు, భోలే బాబాలు, స్వాములోర్లు ప్రతి ఊరు, నగరంలో కొత్త రూపాల్లో దర్శనమిస్తునే ఉంటున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శాస్త్రీయ ధృక్పథాన్ని అలవర్చాలని, ప్రశ్నించే తత్వాన్ని పెంచాలని సంస్థ కోరింది. సనాతన ధర్మం, అంధ మత విశ్వాసాల పేరిట కాలం చెల్లిన వైదిక వ్యవస్థను పునరుద్ధరించే యత్నాలు తీవ్రంగా జరుతున్నాయని సంస్థ ఆందోళన వెలిబుచ్చింది. అంతరిక్షం నుండి మట్టిన పరీక్షల కోసం నేలకు తెస్తుంటే మరోవైపు బాబాల పాద ధూళి కోసం తాపత్రయ పడడం బాధాకరమని పేర్కొంది. దేశ ప్రధానే తాను దైవదూతనని చెప్పడం ఆందోళన కరమని పేర్కొంది. దేవునికి ప్రతినిధులమని చెప్పుకుంటూ విద్వేషాన్ని రగిల్చేవారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ కోరింది.

ఓలలాడించిన రఫీ సంగీత విభావరి



యుగళగీతం ఆలపిస్తున్న గాయకులు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన సంకీర్తన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నేపథ్య గాయకులు మహమ్మద్ రఫీ వర్ధంతి సందర్భంగా స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి 'సుహాని షామ్' రఫీ సాబ్ కు యాద్ మే పేరిట మ్యూజికల్ నైట్ నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పురుషోత్తమరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో డాక్టర్ పురుషోత్తమరావుతో పాటు తెనాలికి చెందిన షేక్ సైదా, ఎం.మల్లిక, పొన్నూరుకు చెందిన పిఎల్ అలీఖాన్, హైదరాబాదు నుంచి షేక్ కాజా షాన్వాజ్, శారద రాజా, కె.రాజేశ్వరరావు తదితరులు మహమ్మద్ రఫీ గేయాలను ఆలపించారు. సంగీత ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో సంగీత ప్రియులు, రఫీ అభిమానులు విశేషంగా పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న విద్యార్థి నాయకులు.. వారితో పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి తదితరులు

గీతాంజలి స్కూల్లో విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎమ్‌టిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో ఉన్న గీతాంజలి స్కూల్లో శనివారం సాయంత్రం విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి గుంటూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ కె.బాలకృష్ణ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే విద్యార్థిని, విద్యార్థులకు పాఠశాలలో ఎన్నికలను పాఠశాల యాజమాన్యం నిర్వహించింది. ఎన్నికైన వారి ప్రమాణస్వీకారోత్సవాని అట్టహాసంగా నిర్వహించగా వారికి డిప్యూటీ కలెక్టర్ కె.బాలకృష్ణ బ్యాడ్జీలను పెట్టి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు బాల్య దశనుండే ఇలాంటి బాధ్యతలను చేపట్టడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి, మంచి ప్రతిభావంతులుగా రాణించడానికి తోడ్పడుతుందని చెప్పారు. భావి భారత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థి నేతలు తమ విధులను బాధ్యతతో నిర్వహించాలని, అవసరాన్ని తెలుసుకోవాలని అన్నారు. ఈ ఎన్నికలలో ఎలక్షన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఎం.భార్గవిని ఉపాధ్యాయ బృందం అభినందించింది. అనంతరం విద్యార్థి నాయకులతో పాఠశాల ప్రిన్సిపాల్ దీనా కుమారి ప్రమాణస్వీకారం చేయించారు.



మృతుని కుటుంబీకులతో మాట్లాడుతున్న డివి కృష్ణ

సిమెంట్ ఫ్యాక్టరీ ప్రమాద క్షతగాత్రులకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట వద్ద గల అల్ట్రాటెక్ సిమెంటు ఫ్యాక్టరీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో గాయపడిన వారు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న ఎనిమిది కార్మికుల్లో ఆకుల వెంకటేష్ అనే కార్మికుడు మరణించాడు. మిగిలిన కార్మికులు మెరుగైన వైద్యం అందించాలని ఎన్‌టిఆర్ జిల్లా సిపిఎం కార్యదర్శి డి.వి.కృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌సి హెచ్ శ్రీనివాస్, అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎం.సోమేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కృష్ణ కోరారు. బాధితులను నాయకులు పరామర్శించి మాట్లాడుతూ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని, బాధితులకు సరైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మంత్రి కొల్లు రవీంద్రకు అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ అభ్యర్థుల వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి : ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని ప్రజాదర్బార్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. 2018లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో గల 1110 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎపిపిఎస్‌సి ద్వారా పరీక్ష నిర్వహించగా 40 వేల మంది హాజరైతే 3,500 మంది అందులో ఉత్తీర్ణత సాధించారు. వైసిపి ప్రభుత్వం ఇంటర్వ్యూలు నిర్వహించగా హైకోర్టులో కేసు వేసి అడ్డుకున్న సంగతిని గుర్తుచేశారు. ఈ కేసు ప్రస్తుతం సుప్రీం కోర్టులో నడుస్తోందని చెప్పారు. న్యాయం చేయాలని ఎంతో మందిని కలిసినా స్పందించలేదని చెప్పారు. 2018 క్వాలిఫై అభ్యర్థులకు న్యాయం చేయాలని విద్యా శాఖ మంత్రి లోకేష్‌కు విన్నవించినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ బిరుదు రవిబాబు తెలిపారు.

10 గంటల తర్వాత వ్యాపారాలన్నీ మూసేయాలి

ప్రజాశక్తి - పొన్నూరు : అన్ని రకాల వ్యాపారాలు, విక్రయాలను రాత్రి 10 గంటలకల్లా మూసేయాలని, పట్టణ సిఐ పి.భాస్కర్ కోరారు. పట్టణంలోకి వచ్చే పెద్ద పెద్ద వాహనాలు రాత్రి పది గంటల నుండి తెల్లవారుజామున 6 గంటలలోపు అనుమతి ఉంటుందని, ఈ దృష్ట్యా షాపులను, తోపుడు బండ్లను 10 గంటల తర్వాత నిర్వహించొద్దని చెప్పారు. నిబంధనలు ఎవరు మీరినా చర్యలుంటాయన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా, గంజాయి విక్రయించే వారి గురించి తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు బహుమతి ఇస్తామని అన్నారు.

అజాత శత్రువు కృపానందం

ప్రజాశక్తి - పెదకూరపాడు



పోలీస్ డిపార్ట్మెంట్లో బాధితులకు సత్వర న్యాయం అందించి ప్రజల మన్ననలు పొందిన డీఎస్పీ మేకల కృపానందం సేవలు మరువ లేనివని రాజకీయాలకు అతీతంగా 75 తాళ్లూరు గ్రామాభివృద్ధికి మేకల కృపానందం, ఆయన భార్య అమర కుమారి చేసిన సేవలు చిర స్మరణీయమని జిల్లా టిడిపి కార్యదర్శి అర్తిమల్ల రమేష్ అన్నారు. మండల పరిధిలోని75 తాళ్లూరు గ్రామానికి చెందిన డి.ఎస్.పి మేకల కృపానందం విగ్రహాన్ని ఆదవారం ఆయన రమేష్ ఆవిష్కరించి మాట్లాడుతూ అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న వ్యక్తి కృపానందం అని కొనియాడారు. అనంతరం కృపానందం అమర కుమారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మక్కిన సాగర్ అండర్ ప్రసాద్ కే వెంకట్ రెడ్డి, కె.సుందరంరెడ్డి, జై కోటిరెడ్డి, జి.నాగేశ్వరరావు, జి.బాబురావు, టి.శివాజీ, అబ్రహం, జి.రాజబాబు, జె. ప్రసాద్ పాల్గొన్నారు.



నాగయ్య దంపతలను సన్మానిస్తున్న చిత్రం

రిటైర్డు ఎంఇఒ నాగయ్యకు ఘనసన్మానం

ప్రజాశక్తి-మాచర్ల రూరల్

ఇటివల రిటైర్డు అయిన ఎంఈఓ నాగయ్య సన్మాన కార్యక్రమంలో పట్టణంలోని శ్రీగౌతమ్ హైస్కూల్ నందు ఆదివారం జరిగింది. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమానికి కెసిపి సీనియర్ జనరల్ మేనేజర్, కిడ్స్ పాఠశాల జాయింట్ సెక్రటరీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా, ప్రైవేటు పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షులు కె.వి. రమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కెసిపి జనరల్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ నాగయ్య క్రమశిక్షణ, అంకితభావం కలిగిన అధికారి అని, చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఈ ప్రాంతంలోనే పుట్టి అధిక శాతం ఇక్కడే విధులు నిర్వహించి, ఈ ప్రాంతలో విద్యావ్యాప్తికి, పాఠశాలల అభివృద్ధికి నాగయ్య చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యలపై ఎంఈఓగా నాగయ్య ఎంతో సానుకూలంగా స్పందించే వారని కె.వి. రమణ అన్నారు. సన్మానగ్రహీత రిటైర్డు ఎంఈఓ నాగయ్య మాట్లాడుతూ పల్నాడు ప్రాంత విద్యాభివృద్ధిలో ప్రైవేటు పాఠశాలల పాత్ర గణనీయ మైందన్నారు. అనంతరం నాగయ్య దంపతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియోషన్ గౌరవ అధ్యక్షులు శ్రీహర్ష వెంకటరెడ్డి, సెక్రటరి జనీత్ శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ ఫాతిమా మర్రెడ్డి, సాయితేజ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా సమస్యలుంటే సంప్రదించండి

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల పట్టణంలో మంచినీటి సరఫరా, ఎటువంటి పారిశుద్ధ్య సమస్యలున్నా వెంటనే తమను సంప్రదించాలని మున్సిపల్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో కోరింది. వర్షాకాలం, సీజనల్ వ్యాధుల దృష్ట్యా కుళాయిలు ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని కాచి, చల్లార్చి, వడగట్టి విని యోగించుకోవాలని కోరారు. ఆయా వార్డుల పరిధిలో తాగునీటి సరఫరాలో ఎటువంటి సమస్యలు, పారిశుధ్యం, డ్రెయినేజీ సమస్యలున్నా సంబంధిత అధికారులు, సిబ్బందిని ఫోన్ ద్వారా అయినా సంప్రదించాలని సూచించారు.

విద్యాభివృద్ధితోనే సామాజిక సాధికారిత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విద్యారంగంలో రాణించడం ద్వారా నే ముస్లింల సామాజిక సాధికారిత, గుర్తింపు సాధ్య మైనంత వేగంగా సాకారం చేసుకోవచ్చని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో జీనత్ ఏ మదర్సా ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్షరానికి విలువనిచ్చే ఏ సమాజంలో అయినా సామాజిక సమస్యలు వాటంతటవే అంతర్థానం కావాల్సిందే అన్నారు. మొదటి నుంచీ కూడా రాష్ట్రంలో ముస్లింలకు, వారి విద్య, ఉపాధి అవకాశాలకు తమ పార్టీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, వైసిపి లాంటి అరాచకశక్తిని తరిమికొట్టాల్సిన అవసరంతో ఎన్డీయేలో తెలుగుదేశం చేరడాన్ని ప్రత్యర్థులు ఎంతగా దుష్ప్రచారం చేయాలని చూసినా ముస్లిం మైనార్టీలంతా చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి విజయం అందించారన్నారు.

ప్రజలు కోరుకున్న మార్పు మొదలైంది

ఎన్నికలకు ముందు ప్రజలు ఏ మార్పు కోసమైతే ఓటుతో విజయం అందించారో రాష్ట్రంలో ఆ మార్పు మొదలైందని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పండరీపురంలోని పుల్లారావు నివాసంలో ఆయనను మర్యాదపూర్వకముగా ఎంపి కలిశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ అన్నమాట ప్రకారం పింఛన్లు రూ.4 వేలు చేయడం నుంచి తిరిగి ఉచిత ఇసుక విధానం అమలు వరకు ప్రజలు ఏం కోరుకున్నారో అవ న్నీ ప్రభుత్వం కొలువు దీరిన స్వల్ప వ్యవధిలోనే అమల్లోకి తీసుకుని రావడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తితో కేంద్రం సహకారంతో అమరావతి, పోలవరం త్వరితగతిన పూర్తి చేయడం, కొత్త మౌలిక వసతుల ప్రాజెక్టులు, రహదార్లు, పోర్టులతో రాష్ట్రాన్ని తిరిగి అన్ని రంగాల్లో నంబర్-1 స్థానంలో నిలపడమే ప్రజాప్రభుత్వం లక్ష్యంగా చెప్పారు పల్నాడు జిల్లాతో పాటు చిలకలూరిపేట నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం పుల్లారావు మాట్లాడారు.



చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసిన ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

అన్నదాన బ్రోచర్, వాల్ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-వినుకొండ

తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో 20 వేల మందికి అన్నదాన కార్యక్రమం భాగంగా స్థానిక శాసనసభ్యులు జీవి ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కిన మల్లికార్జునరావులు అన్నదాన బ్రోచర్, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రతి సంవత్సరం మెట్ల పూజ చేసే భక్తులకు అదేవిధంగా కొండపైకి వెళ్లే భక్తులకు ఉచిత తాగునీరు, భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ జాజులు మాల్యాద్రి, బద్దిక నరసింహారావు, ఎక్స్ ఎ జి పి సైదారావు, నల్లబోతు రామకోటేశ్వరరావు, పువ్వాడ కృష్ణ, మోటమర్రి నరసింహారావు, బ్రాహ్మణపల్లి మహిళా భక్త బృందం పాల్గొన్నారు.





'మన ఊరు- మన కొండ' ఆత్మీయ సమావేశం

వినుకొండ మండలంలోని విటమరాజు పల్లె వద్ద గల శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మన ఊరు- మన కొండ' ఆత్మీయ సమావేశం ఆదవారం నిర్వహించారు. ఈ నెల 17న తొలి ఏకాదశిని పురస్కరించుకొని వినుకొండ వర్తక ,వ్యాపార సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం గురూజీ చేతుల మీదగా వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం సాయంత్రం 6:30 కు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పెండ్యాల మోహనరావు, తాతా రమేష్, పెండ్యాల కాశి, కొప్పు రావూరి సుధాకర్, పెండ్యాల సురేష్, పరుచూరి సత్యనారాయణ, డి టి వి ఎస్ స్వామి, పెండ్యాల పుల్లారావు, వీరాస్వామి, నాగమణి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో ఉన్న ఆర్య వైశ్యులు ఐకమత్యంగా ఉంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ఇందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ చొరవ చూపుతుందని మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. నరసరావుపేట పట్టణంలోని కోట సెంటర్ లోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం తొలి కార్యవర్గ సమావేశం జరిగింది.

ఈ సమావేశానికి పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అత్తులూరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. నరసరావుపేట పట్టణానికి చెం దిన అయినవోలు సాంబశివరావును రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ప్రకటించి నియామక పత్రం అందజేశారు. రామ సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే ఏడాది దుబాయ్ లో జరగనున్న ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సమావేశాలకు భారతదేశం నుండి అధిక సంఖ్యలో ఆర్యవైశ్యులు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యమత్యంగా ఉండి సమాజాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలన్నారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు సక్రమంగా అమలు కావడం లేదని ఇటువంటి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు అనంతరం పలువురు పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్ షిప్ లు అందజేశారు.



మంత్రి దృష్టికి వైద్య సిబ్బంది కొరత

ప్రజాశక్తి-మాచర్ల

మాచర్ల నియోజకవర్గ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటి వైద్యశాలల్లో సిబ్బంది కొరతవుందని, ఖాళీ స్థానాలు భర్తీ చేయాలని వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు మాచర్ల బిజెపి నాయకులు వినతి పత్రం అందించారు. అమరావతిలో మంత్రిని బిజెపి మాచర్ల అసెంబ్లీ కన్వీనర్ నాసరయ్య, ఎస్‌సి మోర్చా నాయకులు విజయ్‌కుమార్, కంభంపాటి అమర్, శ్రీనివాసరావు కలిశారు. మాచర్లలోని వైద్యశాలలో వున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ఇందుకు స్పందించిన మంత్రి, మాచర్ల నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతి పత్రం అందిస్తున్న మాచర్ల బిజెపి నాయకులు



ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐక్యతతో రాజకీయ అభివృద్ధి

ప్రజాశక్తి-ఈపూరు

మాదిగలు ఐక్యతతో రాజకీయ అభివృద్ధి సాధించవచ్చని మాజీ జెడ్పిటిసి బందెల కన్నయ్య అన్నారు. మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన ఈపూరు సెంటర్లో కేక్ కట్ చేని, ఎమ్మార్పీఎస్ జెండాను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. మాదిగల హక్కుల కోసం పోరాటాలు చేసిన ఘనత ఎమ్మార్పీఎస్ పార్టీదేనని నాయకులు అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్ల మీసాల చెంచయ్య, రామయ్య,ముసలయ్య, స్టాలిన్, రామాంజనేయులు పాల్గొన్నారు.



కూటమి అధికారంలోకి వచ్చినందుకు 'ఆక్స్‌ఫర్డ్' డైరెక్టర్ రాజారెడ్డి పాదయాత్ర

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి-జనసేన-బిజెపి కూటమి ఘన విజయం సాధించడం, పల్నాడు జిల్లా వ్యాప్తంగా టిడిపి విజయం సాధించడంతో పాటు వైసిపిని వీడి టిడిపి లోకి వచ్చిన లావు శ్రీకృష్ణ దేవరాయలు అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన నేపథ్యంలో నరసరావుపేట నుండి తిరుమలకు ఆక్స్ ఫర్డ్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రాజారెడ్డి మొక్కుబడిగా తన అనుచరులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఆదివారం పల్నాడు రోడ్డులోని తమ విద్యా సంస్థల వద్ద నుండి పాదయాత్ర ప్రారంభించారు.పాదయాత్ర చేస్తున్న అభిమానులను బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద శ్రీకృష్ణ దేవరాయలు కలసి సంఘీభావం తెలిపారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

టన్నుల కొద్దీ తీసేస్తున్నా కొలిక్కిరాని పూడికతీత

- పట్టణంలో కొనసాగుతున్న డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు
- పనుల్లో యంత్రాలతోపాటు కార్మికులు


కాల్వల్లో వ్యర్థాల తొలగింపులో పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. దీర్ఘకాలికంగా పూడికతీతకు నోచని కాల్వల్లో వ్యర్థాల తొలగింపు అధికారులకు సవాలుగానే మారింది. రోజులకు రోజులు కష్టపడుతున్నా కొలిక్కి రావడం లేదు. ప్రధానంగా మురుగు కాల్వల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తుండాలి. దానికోసం ప్రత్యేకంగా 40 మంది కార్మికులను పురపాలక సంఘం అదనంగా ఉపయోగిస్తున్నా పూర్తిస్థాయిలో పనులు చేయకపోవటంతోనే ఇప్పుడు సమస్య జఠిలమైందని స్థానికులు అంటున్నారు. పైగా ఎక్కడికక్కడ కాల్వలపై శ్లాబ్ తరహాలో బల్లలు, బండలు వేసి సిమెంట్ చేసేశారు. దీంతో వ్యర్థాలు తొలగించేందుకు వీల్లేకుండా పోయింది. ఫలితంగా వర్షం పడితే వీధులన్నీ జలమయం కావటం, వర్షపునీటికి మురుగునీరు తోడై ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా స్పందించారు. కమిషనర్‌తో పాటు అధికారులతో సమీక్షించి మురుగు కాల్వల ప్రక్షాళనకు ఆదేశించారు. దీనిపై దాదాపు 15 రోజులుగా టౌన్‌ప్లానింగ్ విభాగం కసరత్తు చేస్తోంది. ఎక్కడి కక్కడ సైడు కాల్వలపై శ్లాబుల తరహాలో ఏర్పాటు చేసుకున్న బండలను జెసిబితో తొలగించి టన్నుల కొద్ది వ్యర్థాలను కాల్వల నుంచి వెలికి తీస్తున్నారు. బుర్రిపాలెం రోడ్డులో చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆదివారం కూడా పనులు యథావిధిగా కొనసాగుతున్నాయి. జెసిబిలకు తోడు కార్మికులు సైతం కాల్వల్లోకి దిగి మరీ వ్యర్థాలను వెలికి తీస్తున్నారు.


కాల్వలపై శ్లాబ్ తరహాలో వేసిన మూతలను తొలగిస్తున్న జెసిబి


ఘనంగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) ఉద్యమం ద్వారా మాదిగ జాతి కోసం మంద కృష్ణమాదిగ తన జీవితాన్ని పణంగా పెట్టారని టిడిపి రాష్ట్ర నాయకులు సుద్దపల్లి నాగరాజు అన్నారు. కృష్ణ మాదిగ పుట్టినరోజు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం ఎంఆర్‌పిఎస్ జెండాలను ఆవిష్కరించారు. కొలకలూరులో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత గ్రామ కూడలిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. నాగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం చేశారు. ఎస్.మురళీధర్, ఎ.శరత్, ఎస్.కోటేశ్వరి, ఎ.కరుణ, సద్గుణరావు, ఎం.సురేష్, ఎం.గురుదేవ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

కొత్త బస్టాండ్ వద్ద బాబూగ్జవన్‌రామ్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. ఎంఇఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎన్‌డిఎ పార్టీలు ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, సిఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని కోరారు. కె.నాగేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, సిహెచ్ విక్టర్‌పాల్, భాస్కర్, బి.వెంకయ్య, పి.దాసు, కె.బుజ్జి, బి.నరసింహారావు పాల్గొన్నారు.

డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న సంస్థ బృందం


డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్‌కు 'మానవత' లైఫ్ టైం అచీమెంట్ అవార్డు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన 'మానవత' స్వచ్ఛంద సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ కుమార్ పంప్స్ సత్సంగ్ హాల్లో సంస్థ చైర్మన్ డాక్టర్ కె.రామ్‌చంద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత సంస్థ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్ష కార్యదర్శులుగా కటకం ప్రసాద్, పి.వెంకట్, కోశాధికారిగా ఎస్‌వి శర్మ, ఉపాధ్యక్షులుగా పి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా డివి సోమయ్య శాస్త్రి ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వైద్య రంగంలో 40 ఏళ్లుగా విశేష సేవలందించిన డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్‌కు మానవత స్వచ్ఛంద సంస్థ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహోన్నత లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భవించి ఏడాది కాలంలో విశేష సేవలను అందించిందని అన్నారు. వివేకా విద్యా సంస్థల అధినేత డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు మాట్లాడుతూ విద్యా, వైద్య, పారిశ్రామిక, జర్నలిజం విభాగలలో ఎంతో వృద్ధి సాధించిన తెనాలిలో మానవత సంస్థ చేపట్టిన కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. సభలో పి.శ్రీనివాసరావు, టి.శ్రీనివాసబాబు, వి.రామలింగాచారి, ఎం.సత్యనారాయణ, పి.రమేష్‌బాబు ప్రసంగించారు. డాక్టర్ నాగేశ్వర ప్రసాద్, డాక్టర్ ఉమామహేశ్వర రావు, డాక్టర్ హరీష్ పాల్గొన్నారు. తొలుత వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన కుచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

బీసీ ప్రజాప్రతినిధుల్ని సన్మానిద్దాం

సిఎం, డిప్యూటీ సిఎంనూ సత్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం తీర్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

ఇటీవల ఎన్నికల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిచిన బీసీలైన వారిని, మంత్రుల్ని ఘనంగా సన్మానించాలని బీసీ సంక్షేమ సంఘం తీర్మానించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షత వహించిన శంకరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయితోపాటు జిల్లాస్థాయిలోనూ భారీ ఎత్తున సన్మాన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గంలోకి ప్రతి జిల్లా నుండి ముగ్గురుని కో-ఆప్ట్ చేసుకుంటున్నట్లు, జిల్లా కార్యవర్గాలలో మార్పులు-చేర్పులు చేస్తూ, అన్ని జిల్లాల్లో సంఘాన్ని మరింత విస్తృతం చేసేందుకు కషి చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. అనుబంధ సంఘాలను, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు అనుబంధ విభాగాలను రాష్ట్ర, జిల్లా స్థాయిలలో, రాజకీయ పార్టీలకు ధీటుగా పటిష్టంగా నిర్మాణం చేయాలని తీర్మానించామని చెప్పారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి, మంత్రి లోకేష్‌ను సంఘ రాష్ట్ర నాయకత్వం కలిసి సన్మానించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు శంకరరావు తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి కుమార్ మాట్లాడుతూ ఈనెల 15న రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పుట్టినరోజును అన్ని యోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించాలని, సమావేశం తీర్మానించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మ జ్యోతిబా పూలే బీసీ భవన్‌ల నిర్మాణం కోసం, అన్ని జిల్లాల కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలను అందజేయాలని తీర్మానించామన్నారు. రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మానంద శర్మ మాట్లాడుతూ విజయవాడ- గుంటూరుల మధ్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా, మహాత్మ జ్యోతిబా పూలే-సావిత్రిబాయి పూలేల స్మృతి వనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని తీర్మానించామన్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి.సోమరాజు, బీసీ ఉద్యోగ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.మహేష్ పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న కేసన శంకరరావు

స్కాలర్‌షిప్పులు కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

ప్రతి ఏడాదికి లాగానే ఈ ఏడాది కూడా పెదనందిపాడు ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ 2024-25 విద్యా సంవత్సరానికి పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు, పర్చూరు మండలాల్లోని పేద విద్యార్థులు స్కారల్‌షిప్‌ల పంపిణీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సాయిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్. ఎంసెట్, మెడిసిన్, అగ్రికల్చర్ బీఎస్సీ, సిఎ, సిపిటిలో 10 వేలలోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు సీటు వచ్చే అవకాశం ఉన్న విద్యార్థులు, 125కు పైగా మార్కులు వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు, పదవ తరగతి, ఇంటర్మీడియట్ ర్యాంకు కార్డుల ఫొటోస్టాట్ కాపీలతోపాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు జతపరిచి, ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, పెదనందిపాడులోని గుంటూరు రోడ్డు ఇర్మియా సూపర్ బజార్ వద్ద అందించాలని సూచించారు. విద్యార్థులకు దరఖాస్తు ఫారాలు కూడా అక్కడే లభిస్తాయని, పూర్తి వివరాల కోసం 9949270785 నంబరులో సంప్రదించాలని సూచించారు.



డాక్టర్ శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తెనాలి

ప్రభుత్వ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ గా సేవలందించిన డాక్టర్ ముత్తె శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం కొలకలూరులో నిర్వహించారు. గ్రామానికి చెందిన శ్రీనివాసరావు సభను ఆయనతోపాటు 10వ తరగతి కలసి చదివిన మిత్రులు నిర్వహించారు. శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించి, ఆయన సేవలను ప్రశంసించారు. పాఠశాల దశలో శ్రీనివాసరావుతో ఉన్న అనుబంధాన్ని మిత్రులు నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉన్నం ఎహెస్కేలు, రేపల్లె నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ జానీబాష, తెలంగాణ రాష్ట్రంలో అకౌంట్స్ ఆఫీసర్ కాలిశెట్టి శ్రీనివాసరావు, ప్రయాగ చంద్రశేఖర్, కొంగర సాయి, బాలాజీ, శ్యాంసుందర్, మజీద్, వెంకట్రామయ్య, మల్లికార్జున, బసవ శంకర్, విజయలక్ష్మి, ఝూన్సీ, శివ పార్వతి, శామ్యూల్, నరసింహారావు, ముత్తే బ్రదర్స్ పాల్గొన్నారు.

కూటమి గెలిచినందుకు పాదయాత్ర

ప్రజాశక్తి - మంగళగిరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంగళగిరిలో నారా లోకేష్ భారీ మేజార్టీతో గెలవడం పట్ల గుంటూరు జిల్లాకు చెందిన శాలివాహన సంఘం సభ్యులు మంగళగిరి పట్టణంలోని శ్రీలక్ష్మినరసింహాస్వామి ఆలయంలో ఆదివారం పూజలు చేశారు. గుంటూరు జిల్లా శాలివాహన సంఘం ఉపాధ్యక్షులు పారేళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో 117 మంది శాలివాహన సంఘం సభ్యులు గుంటూరు నుంచి మంగళగిరికి పాదయాత్రగా వచ్చి ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరిలో పోటీ చేసిన నారా లోకేష్ అఖండ మెజారిటీతో గెలవాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఎన్నికల ముందు మొక్కుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అరాచక పాలనను అంతం చేసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోటప్పకొండ సత్రం ఉపాధ్యక్షులు ఎం.యమలరాజు, నాయకులు ఎం.శివప్రసాద్, జి.ఆంజనేయులు, ఎ.యమున, కె.ఆదిలక్ష్మి, ఎన్.శివరామ కృష్ణ, జి.రాఘవ, బి.ప్రసాద్, చిరంజీవి, కె.అంజిబాబు, బి.శంకర్, కె.వీరాంజనేయులు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

10న కలెక్టరేట్ వద్ద నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన సంక్షేమ చట్టం చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గుంటూరు నగర ముఠావర్కర్స్ యూనియన్ టింబర్ ముఠా కార్మికుల విస్తృత సమావేశం జీటీ రోడ్డులోని ఆదివారం నిర్వహించగా శ్రీనివాసరావు మాట్లాడారు. పదేళ్ల నుండి ముఠా కార్మికులకు సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని కోరుతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోవట్లేదన్నారు. పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగితే పట్టించుకునే వారే లేరన్నారు. కనీసం మౌలిక సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేక ముఠా కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. యజమానులు స్పందించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రావిడెంట్ ఫండ్ సకాలంలో చెల్లించని యజమానులకు గతంలో పెనాల్టీలు ఐదు శాతం నుండి 20 శాతం వరకు విధించే వారని, నూతన చట్టం ప్రకారం ఒక శాతం నుండి 5 శాతం వరకు పెనాల్టీలను తగ్గించటం సరికాదన్నారు. దీనివల్ల భవిష్యత్తులో కార్మికులకు పిఎఫ్ అందే పరిస్థితి లేదన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేసి, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 10వ తేదీన గుంటూరు కలెక్టర్ కార్యాలయాల ఎదుట జరిగే నిరసన కార్యక్రమంలో ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశానికి జిలాని అధ్యక్షత వహించగా, మేస్త్రులు వెంకటేశ్వర్లు, హుస్సేను, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఎంపీ పరామర్శ



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : భుజం నొప్పికి ఇటీవల హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం గుంటూరు వచ్చిన సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు ఆదివారం పరామర్శించారు. స్థానిక కన్నావారితోటలోని లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లి లక్ష్మీనారాయణ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొద్దిసేపు వివిధ అంశాలపై చర్చించారు.

విత్తనం.. క్రయవిక్రయాల్లో జాగ్రత్త అవసరం..

- నిబంధనలు తప్పనిసరి... తరచు తనిఖీలు...
- లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనాలి.. రసీదులూ పొందాలి
- కృత్రిమ కొరత సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు
- పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి



ఇటీవల నరసరావుపేట పట్టణంలో విత్తన దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఖరీఫ్ సీజన్ రావడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఇదే తరుణంలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకుని ఆయా షాపుల నిర్వాహకులు మోసాలకు పాల్పడకుండా వ్యవసాయశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. విత్తన చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు అన్యాయం జరిగితే విత్తనాలు అమ్మిన డీలర్లపై ఈ చట్టం ద్వారా కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే ఊరుకోబోమంటూ హెచ్చరి స్తున్నారు. లైసెన్స్ పొందిన దుకాణాల నుంచి మాత్రమే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులకు సూచించడంతోపాటు ఈ మేరకు అవగాహన కార్యక్రమాలూ నిర్వహిస్తున్నారు. పల్నాడు జిల్లాలో ఎరువులు విత్తనాల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, విత్తన ఎరువుల దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. నకిలీ విత్తనాలు పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు నిబంధనలు పాటించాలని, రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు.



పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐ.మురళి

రైతులను డీలర్లు మోసగిస్తే...

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా డీలర్లపై కఠినమైన చర్యలు చేపట్టే వీలుంది. విత్తన చట్టం-1966, విత్తన నిబంధనలు-1968, విత్తన నియంత్రణ-1983 చట్టాల ఆధారంగా అతిక్రమణలు, ఉల్లంఘనలు వర్తించేలా విత్తన చట్టం రూపొందించారు. విత్తన విక్రయాల్లో మోసాలకు పాల్పడే వారిపై ఆయా దుకాణాల్లో విత్తనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. విత్తన, ఎరువుల దుకాణాలలో తప్పనిసరిగా విత్తన లైసెన్స్ ప్రదర్శించాలి. లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలను నిలిపివేయడంతో పాటు డీలర్‌షిప్‌ను సైతం రద్దు చేయవచ్చు.

బోర్డులు, రసీదులు తప్పనిసరి...

విత్తనాలు విక్రయించే దుకాణాల్లో కచ్చితంగా ధరలు, స్టాకు బోర్డులను ఏర్పాటు చేయాలి. లేకుంటే ఆయా దుకాణాల్లో విత్తనాల అమ్మకాలు నిలుపుదల చేయవచ్చు. లేదా డీలర్‌షిప్ రద్దు చేయవచ్చు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఆయా దుకాణదారుడు కచ్చితంగా వ్యవసాయ శాఖ అనుమతి పొందిన పుస్తకం నుండి రసీదు ఇవ్వాలి. లేకుంటే విత్తన నియంత్రణ ఉత్తర్వులు-1983 క్లాజు 9 ప్రకారం దుకాణదారుడికి ముందుగా నోటీసు జారీ చేసి దానికి సరైన సమాధానం ఇవ్వకుంటే లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

ఆ విత్తనాలు కొనొద్దు...

విత్తన దుకాణంలో కొనుగోలు చేసిన విత్తనాల బస్తాలకు లేబుల్ లేకపోతే విత్తన చట్టం-1966 సెక్షన్-7 ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. ఆయా విత్తనాలను సీజ్ సైతం చేయవచ్చు. అత్యవసర సరుకుల చట్టం-1955 సెక్షన్ 7 ప్రకారం జరిమానా విధించవచ్చు. కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే డీలర్ లైసెన్స్ సస్పెండ్ లేదా రద్దు చేయవచ్చు.

భూ కమతాల మూడో దశ సర్వే ప్రారంభం

- వివిధ అంశాలపై ప్రభుత్వానికి నివేదికలు
- జూన్ వర్షపాతం ఆశాజనకం
- ప్రజాశక్తితో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.శేషశ్రీ



జిల్లాలో నిత్యం వివిధ అంశాలపై సమాచారం సేకరణ ద్వారా ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదికలు పంపుతామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.శేషశ్రీ తెలిపారు. వర్షపాతం, మార్కెట్ ధరలు, పంట స్థితిగతులు, పంటకోత ప్రయోగాలు, ప్రభుత్వం కోరిన వివిధ రకాల సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ప్రభుత్వానికి అందచేయడంలో తమశాఖ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలు తెలియజేశారు.



భూ కమతాల సర్వే పూర్తయిందా?

సర్వే మొదటి రెండు దశలు పూర్తయ్యాయి. మూడో దశ జరుగుతోంది. భూమి ఎవరి అధీనంలో ఉంది? వారికి ఎలా సంక్రమించింది? భూమి రికార్డుల అప్‌డేట్ ఆధారంగా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. భూమి ఎవరి అధీనంలో ఉంది? వారికి నీటి వసతి ఉందా? భూమి స్వరూపం, ఏయే పంటలు ఎక్కువగా సాగవుతాయి తదితర వివరాలు నమోదు చేస్తాం. మొదటి రెండు దశల్లో భూమి ఎవరి అధీనంలో ఉందో నిర్ధారణ చేశాం. కమతాల వారీగా భూమి స్వరూపం, ఇతర వివరాలు నమోదు చేశాం. మూడో దశలో రైతులకు లభిస్తున్న మౌలిక సదుపాయాలపై వివరాలు సేకరిస్తున్నాం.

జూన్‌లో వర్షపాతం ఎంత నమోదైంది?

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని మండల కేంద్రాల నుంచి ప్రతి రోజు వర్షపాతం వివరాలు నమోదు చేస్తాం. జూన్‌లో వర్షపాతం ఆశాజనకంగా ఉంది. గత నెలలో సగటున 97.1 మిల్లీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా నెల మొత్తం మీద 160.5 మిల్లీ మీటర్ల మేరకు వర్షపాతం నమోదైంది. జులైలో 164.9 మిల్లీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా 7వ తేదీ వరకు 16.9 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. జూన్‌లో 15 మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా, మూడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాలు బాగా కురిసిన ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు అవకాశం ఏర్పడింది.

మార్కెట్ ధరలు ఎలా నమోదు చేస్తారు?

నిత్యావసర వస్తువులు ధరలు నిత్యం తమ సిబ్బంది సేకరిస్తారు. ప్రజలు ఎక్కువగా వినియోగించే నిత్యావసర సరుకులకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ప్రభుత్వానికి పంపుతాం. ధరల పెరుగుదల, మార్కెట్ స్థితి గతులు తదితర సమాచారం ఆధారంగా ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటాయి.

పంట దిగుబడి అంచనా ఎలా చేస్తారు?

ఎంపిక చేసిన పంటలకు దిగుబడిపై క్షేత్రస్థాయిలో పొలంలో పంట కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనాలు నమోదు చేస్తాం. వ్యవసాయ ఉత్పత్తులు చేతికి వచ్చే ముందు ఈ ప్రయోగాలు నిర్వహిస్తాం. మొత్తం పంటలో కొంత భాగాన్ని తీసుకుని నూర్పిడి చేయడం తదితర ప్రక్రియల ద్వారా ఉత్పత్తి సగటు అంచనాలు రూపొందిస్తాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

హైస్కూళ్లలో పోస్టులు మంజూరు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్వర్ణాంధ్ర నగర్, భారత్‌పేట, గుజ్జనగుండ్ల, వెంగళరావు, కొండా వెంకటప్పయ్య కాలనీలోని అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలలకు సబ్జెక్ట్ టీచర్లు, ప్రధానోపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని యుటిఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు, హెచ్ఎం పోస్టులు లేక సెకండరీ గ్రేడ్ టీచర్లతోనే బోధన, పరిపాలన బాధ్యతలు చేయిస్తున్నారని, గత ఐదేళ్ల నుండి ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వందల మంది పదో తరగతి పూర్తి చేస్తున్న ఈ హైస్కూల్స్‌లో అవసరమైన టీచర్ పోస్టులు మంజూరు చేయకపోటం శోచనీయమని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్జెక్టు టీచర్లు, హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు.

కవితల పోటీల్లో 9 మంది ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

అమరావతి సాహితీ మిత్రులు సంస్థ వారు ఫేస్‌బుక్ గ్రూపులో అంతర్జాతీయ స్థాయిలో వారం వారం నిర్వహిస్తున్న కవితల పోటీల్లో భాగంగా ఈ వారం నిర్వహించిన కవితల పోటీల్లో 9 మంది పంపిన మినీ కవితలకు ప్రశంసాపత్రాలు లభించాయని సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఉచితాలు' అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీల్లో 55 మంది కవితలు పంపించగా వివిధ జిల్లాలకు చెందిన కాయల నాగేంద్ర, సంబరాజు రమణి, చిత్తలూరి, గోలి హనుమశాస్త్రి, సింగరాజు శ్రీనివాసరావు, మైథిలి, ఎనికేపల్లి శివకుమార్, దినవహి సత్యవతి, సుధా కోసూరి ఎంపికయ్యారని తెలిపారు.